క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఉపాధ్యాయుల ధర్నాలో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

సాక్షి, భీమవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో చేపట్టిన దశల వారీ పోరాటంలో భాగంగా శనివారం భీమవరం కలెక్టర్ కార్యాలయం సమీపంలో 12 గంటల ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బీహెచ్ జవహర్‌లాల్‌రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎస్, నూతన విద్యా సంస్కరణలను రద్దు చేయాలని, జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్ విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌ప్రకాష్ వైఖరిని ఖండిస్తూ, బదిలీలు, ప్రమోషన్లలో ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు బోధ నేతర పనులు విధించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్.సాయి శ్రీనివాస్, బి.గోపి మూర్తి, పీఎస్ విజయరామరాజు, ఏకేవీ రామభద్రం, కేవీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సాయి భక్తుల తీర్థయాత్ర



తీర్థయాత్రలకు బయల్దేరి వెళ్తున్న సాయిబాబా సేవకులు

కాళ్ల: అధిక శ్రావణమాసం ఏకాదశి మహాపర్వ దినాన్ని పురస్కరించుకొని సాయిబాబా సేవకులు పుణ్యక్షేత్రాలకు శనివారం బయల్దేరారు. సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో బయలుదేరిన సాయిభక్తులు 52 వారాలు సేవచేసి 53వ వారంలో బస్సుల్లో యాత్రగా వెళ్లారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలోని షిర్డీసాయి దేవస్థానం నుంచి సుమారు 300 మంది సాయి సేవకులు, భక్తులు బయల్దేరారు. తొలుత బాబావారికి ప్రత్యేకపూజలు చేశారు. ర్యాలీ, వాడపల్లి, అన్నవరం, ద్వారపూడి, పిఠాపురం, పెనుగొండ ప్రాంతాల్లో యాత్ర కొనసాగుతుందని, భక్తులకు అల్పాహారం, తాగునీరు, మజ్జిగ, భోజనం తదితర సదుపాయలు దేవస్థానం తరుపున అందిస్తున్నట్టు ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతి దేవి తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

సాక్షి, భీమవరం: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించకపోతే మరో పోరాటానికి సిద్ధమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన మాస్ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తున్నాయన్నారు. మాతాశిశు మరణాలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, ఎంబీ హసీనా, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్



డీజీపీకి పుష్పగుచ్ఛం ఇచ్చిన శ్రీనివాసరాజు

కాళ్ల: డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు కలిశారు. భీమవరం విచ్చేసిన ఆయనను శనివారం శ్రీనివాసరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ఏపీజీఈఎఫ్ పబ్లిసిటీ కార్యదర్శిగా గాంధీ



బీజే గాంధీ

సాక్షి, భీమవరం: ఏపీ ప్రభుత్వ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఏపీజీఈఎఫ్) రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీగా భీమవరం పట్టణానికి చెందిన బీజే గాంధీ ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో జరిగిన ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో చైర్మన్‌గా కాకర్ల వెంకటరామిరెడ్డిని ఎన్నుకోగా పబ్లిసిటీ సెక్రటరీగా ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న గాంధీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ విద్యావిధానంలో కాంట్రాక్టు వ్యవస్థ లేకుండా అందరినీ క్రమబద్ధీకరించే విధంగా కృషిచేస్తానని చెప్పారు.

ఉత్సాహంగా యూత్ ఫెస్ట్



యూత్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మన్నా చర్చ్‌లో శనివారం యూత్ ఫెస్ట్ ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ యువత బాధ్యతగా నడుచుకుని భవిష్యత్‌లో స్థితప్రజ్ఞులు కావాలని ఆకాంక్షించారు. యువత వయసులో ప్రతి ఒక్కరికి అనేక కోరికలు ఉంటాయని, రంగుల లోకం మాయలోకం లాంటిదని గుర్తుంచుకోవాలని అన్నారు. యువత బాధ్యతగా నడుచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆయన కోరారు. యువకులుగా ఉన్నప్పుడు మంచి బైక్ కొనుక్కోవాలని, సంతోషంగా ఆనందంగా తిరగాలని ప్రతి ఒక్కరు కోరుకోవడం సహజమని, కాని రంగుల లోకంలో మాత్రం ఎవరు విహరించవద్దని ఆయన పేర్కొన్నారు. యువత చేతుల్లోనే కుటుంబ, రాష్ట్ర, దేశ భవిష్యత్తు ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మన్నా చర్చ్ లో ప్రతీ సంవత్సరం యూత్ ఫెస్ట్‌ను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని, ఈ సందర్భంగా నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బ్యాంక్ కాలనీలో రీడింగ్ రూమ్

సాక్షి, భీమవరం: పట్టణంలోని బ్యాంక్ కాలనీలో మైత్రి కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంధి శ్రీనివాస్ రీడింగ్ రూమ్‌ను శనివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తక పఠనం మేథస్సును పెంచుతుందని, పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం, వినోదం కలుగుతుందన్నారు. మైత్రి కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ ప్రాంతంలో రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కంబాల రామారావు, కార్య నిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు సాయి దుర్గాప్రసాద్, అరేటి భోగేశ్వర కిషోర్, కోశాధికారి కమ్మిల శ్రీరామచంద్ర మూర్తి, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహారాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వసుధకు వందనం



జక్కరంలో మొక్క నాటుతున్న సివ్లారెడ్డి



ఎంపీడీఓ కార్యాలయంలో మొక్క నాటిన ఎంపీపీ



చెరుకువాడలో మొక్క నాటిన సర్పంచ్ సాంబశివరావు

కాళ్ల: మండలంలోని జక్కరం గ్రామంలో 'వసుధకు వందనం 'కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ సివ్లారెడ్డి మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ కూచంపూడి పద్మావతి, ఏపీడీ విజయలక్ష్మి, ఉప సర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె. వెంకటలక్ష్మి, పరిపాలనాధికారి మూర్తి, సీనియర్ అసిస్టెంట్ రమణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో...

ఉండి: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు (శివయ్య) అన్నారు. ఈ గ్రామంలో శనివారం వసుధకు వందనం కార్యక్రమంలో భాగంగా కొబ్బరి, మామిడి, ఉసిరి తదితర పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మొక్కల ద్వారా మనకు కావాల్సిన ఆక్సిజన్ లభిస్తుందని అన్నారు. పచ్చదనాన్ని సంరక్షిస్తే మనల్ని రక్షిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ, ఎంపీటీసీ చిగురుపాటి కృష్టాఫర్, నాయకుడు బొడ్డు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

గొర్లమూడి గ్రామంలో చర్చి ప్రారంభం



లూథరన్ చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

భీమవరం అర్బన్: మండలంలోని కొమరాడ గొర్లమూడి గ్రామంలో శనివారం సుమారు రూ. కోటి 50 లక్షలతో నిర్మించిన ఏపీ ఫానియా లూథరన్ దేవాలయాన్ని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభువు చూపించిన శాంతి మార్గంలో నడుచుకుని జీవితాన్ని శాంతిమయం చేసుకోవాలని కోరారు. అనంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్, మోస్ట్ రైట్ రెవ డా. కెఎఫ్ పరదేశిబాబు, పాస్టర్ ప్రవీణ్ కుమార్, పాలమూరి సుందర్రావు, తోటే రత్నకుమార్, ప్రేమ్ ప్రకాష్, లాజర్, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, మాజీ ఉపసర్పంచ్ అల్లూరి రవికుమార్ రాజు, మద్దాల రమణ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



భీమవరంలో ఎస్టీఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం భీమవరంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీఎఫ్ఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి.గోపిమూర్తి ఎస్టీఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేట్ మయం చేసే విధంగా నూతన జాతీయ విద్యా విధానం చట్టం తీసుకొచ్చిందని దీనివల్ల ప్రభుత్వ విద్యారంగం తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా కేంద్రప్రభుత్వ విద్యావిధానానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ విజయరామరాజు, ఏకేవీ రామభద్రం, ఎం.మార్కండేయయులు, కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కాళ్ల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బహుజన సమైక్య రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్టు సమైక్య అధ్యక్షుడు, ఫౌండర్ సోడదాసి గంగయ్య పేర్కొన్నారు. సీసలి గ్రీన్ వ్యూ ఇంటర్‌నేషనల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీఓ దాసి రాజు, డీఈఓ ఆర్వీ రమణ, ఆకివీడు సీఐ సత్యనారాయణ తదితరులు హాజరవుతారని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన ఆశయాన్ని కొనసాగించేందుకు సమైక్య కృషి చేస్తోందని పేర్కొన్నారు. టెన్త్ ఫలితాల్లో ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల మండలాల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో సత్కరిస్తామని వివరించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ దాట్ల వెంకట రామరాజుకు రాజా రామ్మోహన్‌రాయ్ సేవా రత్న అవార్డుతో సత్కరిస్తామని తెలిపారు.

పంట కాలువలో మహిళ మృతదేహం

కాళ్ల: పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. కాళ్ల మండలం సీసలి గ్రామ పరిధిలో కె.లంక పంట కాలువలోకి శనివారం ఉదయం 9 గంటల సమయంలో తూముల వద్ద గుర్రపు డెక్కలకు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల్లోపు వయసుగల మహిళ మృతదేహం అడ్డుపడి ఉందన్నారు. మెరూన్ కలర్ జాకెట్, ఆకుపచ్చ, పసుపు ముదురు ఆకుపచ్చ రంగు డిజైన్ గల పాలిస్టర్ దుస్తులు ధరించి ఉన్న మృతదేహం పూర్తిగా పాడైందని తెలిపారు. వీఆర్వో బొల్లి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

కొట్లాటలో ఇద్దరిపై కేసు

ఉండి: చెరుకురసం బండి వద్ద ధర విషయంలో వివాదంపై కొనుగోలుదారు, విక్రేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం పాలకేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై చెరుకురసం అమ్ముకుంటున్న కమతం రమేష్ అనే వ్యక్తితో పాలకోడేరు మండలం గొల్లలకోడేరుకు చెందిన యండవల్లి ప్రదీప్ అనే వ్యక్తి చెరుకురసం కొనేందుకు వచ్చి ధర విషయంలో గొడవపడ్డాడు. ఇద్దరూ కొట్టుకోని గాయపడి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. వారిద్దరి ఫిర్యాదులు, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు.

గ్రంథపాలకుల దినోత్సవం

ఆకివీడు: ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దేశ గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షతవహించిన ప్రిన్సిపాల్ కె.సుజాత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. పుస్తకం చదడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని, పుస్తకం చదవడం ఎంత ముఖ్యమో, పుస్తకాన్ని పలువురికి దక్కే విధంగా కృషిచేయడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. పుస్తకాల్ని సేకరించి, భద్రపరచే ప్రతి వ్యక్తీ గ్రంథపాలకుడేనని చెప్పారు. ఒక్క పుస్తకం కోట్ల మంది ప్రజల మెదళ్లను కదిలిస్తుందని, అటువంటి పుస్తకాల్ని భద్రపరుస్తున్న గ్రంథపాలకుల సేవలు ఎనలేనివని కొనియాడారు. లైబ్రేరియన్ ఫణి రాజు మాట్లాడుతూ పుస్తకాల్ని భద్రపరచడం ఒక కళన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు కృషి

ఆకివీడు: పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్థానిక నగర పంచాయతీ పారిశుద్ధ్య ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన నగర పంచాయతీ మేనేజర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. గత కొన్ని నెలలుగా శానటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉండటంతో జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు. దీంతో పట్టణంలో పారిశుద్ధ్య పనులు కుంటుపడ్డాయి. ప్రజలు, కౌన్సిలర్లు కమిషనర్‌కు ఫిర్యాదులు చేస్తుండడంతో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతలను నగర పంచాయతీ మేనేజర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

ఆకివీడు: మండలంలోని వార్డు సభ్యుల ఉప ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు ఎంపీడీఓ కందుల వాణి శనివారం తెలిపారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో 7, 9 వార్డు సభ్యుల పదవి కోసం నాలుగు నామినేషన్లు దాఖలు కాగా వాటిలో ఇద్దరు ఉపసంహరించుకున్నారని, 7వ వార్డుకు మద్దిశెట్టి లక్ష్మి, 9వ వార్డుకు కట్రెడ్డి సుబ్బారావుల నామినేషన్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. అజ్జమూరు గ్రామంలోని 12వ వార్డుకు బుంగా శాంత కుమారి నామినేషన్ ఒక్కటే దాఖలైందన్నారు. దీంతో వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైనట్టు తెలిపారు.

యువతి అదృశ్యం

ఆకివీడు: స్థానిక సాయినగర్‌కు చెందిన యువతి (21) ఈనెల 11 నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి డి.వెంకటేశ్వరరావు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. స్థానిక క్లాత్ మర్చంట్ షాపులో పనిచేస్తోన్న ఆమె కడుపు నొప్పిగా ఉందని షాపు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఉండి: వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి మండలం ఆరేడు గ్రామానికి చెందిన వివాహిత పట్ల పక్క పోర్షన్‌లో అద్దెకుంటున్న వివాహితుడు పిట్టా సాయి అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కాలేజీలో విద్యుత్ మోటార్ చోరీ

ఆకివీడు: ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం విద్యుత్ మోటార్ చోరీకి గురైందని ప్రిన్సిపాల్ ఎం.బ్రహ్మం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సత్యసాయి శనివారం తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు కాలేజీ తాళాలు బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించారని, విద్యుత్ మోటార్‌ను మాత్రమే తీసుకుపోయారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు చెప్పారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీల దృశ్యం

పాలకోడేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఈశా గ్రామోత్సవం ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల స్ఫూర్తిని పునరుజ్జీవింపచేయడానికి ఈ గ్రామోత్సవాలు దోహదపడతాయని భీమవరం హాస్పటల్ ఎండీ డాక్టరు గోపాలరాజు, లయన్స్ క్లబ్ చైర్మన్ కృష్ణంరాజు అన్నారు. రెండు రోజుల క్రీడల్లో తొలిరోజు పురుషులు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 26 జట్లు పాల్గొన్నాయి. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశా జిల్లా సమన్వయకర్త డాక్టరు విజయ మాట్లాడుతూ క్లస్టర్, డివిజన్, ఫైనల్ స్థాయిలో 3 దశలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు రూ.56 లక్షల నగదు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. ఆదివారం బాలికలు, యవతులకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మరియమ్మ, ఉపసర్పంచ్ వెంకటరాజు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తిబాబుకు మోషేన్‌రాజు పరామర్శ



జవ్వాది సత్తిబాబును పరామర్శిస్తున్న ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: మండలంలోని గూట్లపాడు గ్రామంలో మాతృవియోగంతో బాధపడుతున్న జవ్వాది సత్తిబాబును శనివారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజలు పరామర్శించారు. ఇటీవల జవ్వాది సత్తిబాబు మాతృమూర్తి జవ్వాది సూర్యకాంతం అనారోగ్యంతో మృతి చెందారు. అధైర్య పడవద్దని మేమంతా అండగా ఉన్నామని సత్తిబాబు సోదరులకు భరోసా కల్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ భూసారపు రామారావు కుటుంబాన్ని కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. మోషేన్‌రాజు వెంట జవ్వాది గణేష్, కొప్పర్తి సత్యనారాయణ, చెలంకూరి హనుమ ప్రసాద్, కొప్పర్తి సుబ్బారావు, యాతన త్రిమూర్తులు, చెలంకూరి శ్రీనివాసరావు, ఒడుగు ముత్యాలరాజు, కొప్పర్తి సూరిబాబు ఉన్నారు.

విదేశీ విద్యకు ఆంగ్ల పరిజ్ఞానం అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రేష్మీగేరా

సాక్షి, భీమవరం: ఉన్నత విద్యనభ్యసించడానికి విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఆంగ్లభాషను చక్కగా వినడం, మాట్లాడడం వంటి నైపుణ్యాన్ని అధ్యాపకులు అందించాలని ఢిల్లీకి చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) అకడమిక్ హెడ్ రష్మీ గేరా అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకులు, టోఫెల్ వంటి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలా శిక్షణ అందించాలని అంశంపై శనివారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. ఇంగ్లిష్ భాషలో వస్తున్న ఉపన్యాసంలోని మూలాలను బాగా అర్థం చేసుకునేలా విద్యార్థి శిక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, నడింపల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయకుదురులో కంటి వైద్య శిబిరం

వీరవాసరం: ప్రతి మనిషికి జీవించడానికి కళ్లు ఎంతో అవసరమని సర్పంచ్ గెడ్డం భారతి తెలిపారు. రాయకుదురు గ్రామ సచివాలయం వద్ద శనివారం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మండల పిరమిడల్ స్పీచ్ వోల్ సొసైటీ వారి సారధ్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి సమస్యల పట్ల తక్షణం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సుమారు 150 మందికి కంటి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యసికిత్స కోసం 20 మందిని రిఫర్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పోలిశెట్టి సత్యనారాయణ, షేక్ సత్తార్ సాహెబ్, గెడ్డం భాస్కరరావు, పోలిశెట్టి శివన్నారాయణ, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కడలి నెహ్రూ, కేవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, భీమవరం: అఖిలభారత స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెంటేవారితోటలోని కళాశాల బీసీ బాలుర హాస్టల్ వద్ద ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని చెల్లబోయిన రంగారావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ సేవలను కొనియాడారు.